క్లుప్తంగా

బ్రహ్మాజీవాడిలో సంచార వైద్యం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మాజీవాడిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి సుభాష్‌రెడ్డికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గ్రామీణ సంచార వైద్యం నిర్వహించారు. అవసరమైన వారికి వాహనంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు.

రూ. లక్ష విరాళం

భిక్కనూరు: తిప్పాపూర్‌లోని వేంకటేశ్వరాలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఏనుగు రవీందర్‌రెడ్డి రూ.లక్ష ఒక్క వేయి116లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విరాళ దాత రవీందర్‌రెడ్డిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఎంపీటీసీల ఫోరమ్ మండల కన్వీనర్ సాయిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధరాములు, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు వెంకట్‌రెడ్డి, విండో మాజీ చైర్మన్ చిన్న నర్సారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు బ్లూబెల్స్ విద్యార్థి ఎంపిక



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాలకు చెందిన చెందిన విద్యార్థి నీలకంఠి లోక సహన్ ఇటీవల జరిగిన నవోదయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్షల్లో ఎంపికైనట్లు బ్లూబెల్స్ పాఠశాల కరస్పాండెంట్ సంజీవ్‌రెడ్డి పేర్కొన్నారు. సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ పాఠశాల నుంచి 36 మంది విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్ష రాయగా అందులో సహన్ ఎంపికైనట్లు తెలిపారు. బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థి నవోదయలో ప్రవేశం పొందడంతో పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పిట్లం(జుక్కల్): గౌరారంలో నూతనంగా రూ.20 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం మండల పంచాయతీ అధికారి బ్రహ్మం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, త్వరగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు

భిక్కనూరు: బక్రీద్ పండగ సందర్భంగా భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద ఎస్సై ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పశువుల రవాణాను అడ్డుకునేందుకు చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎస్సై చెప్పారు. టోల్‌ప్లాజా మీదుగా వెళ్లే ప్రతివాహనాన్ని తనిఖీ చేస్తున్నామని ఎవరైన అక్రమంగా పశువుల రవాణాను చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చిరంచారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు హెల్మెట్లు లేనివారికి జరిమానా విధించారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి

రాజంపేట: రాజంపేట గ్రామంలోని కోమటి పోచమ్మ పరిధిలో చేపట్టిన అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రాజంపేట వైశ్య సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో గ్రామానికి చెందిన లింగంపేట నారాయణ, కోమటి పోచమ్మ వద్ద అక్రమ నిర్మాణం చేపడుతున్నపుడు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకొని గుడిని కాపాడాలని వారు కోరారు.

కార్మికుల ఆరోగ్యం ముఖ్యం



మద్నూర్: కార్మికుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని భావించి ప్రభుత్వం భవన, నిర్మాణ రంగ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తోందని సీఎస్‌సీ జిల్లా హెల్త్‌కేర్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జీపీ కార్యాలయ ఆవరణలో సోమవారం కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. లేబర్ కార్డు ఉన్న ప్రతి కార్మికుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాయక్ అన్నారు. సిబ్బంది సాయన్న, దీలీప్, భీమ్‌రావ్, సైలాని, ఉనికేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్కుల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద సోమవారం ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ బుక్కులను ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు శ్రీరాం, సీఆర్పీ శంకర్‌గౌడ్, భూమయ్య, శ్రీధర్, సిబ్బంది పంచాక్షరి తదితరులున్నారు.

విద్యార్థులకు భోజన అవస్థలు

- పాఠశాలలో వంట చేయడానికి ముందుకు రాని ఏజెన్సీ నిర్వాహకులు
- సకాలంలో బిల్లులు రాకపోవడంతో మానేస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



రాజంపేట బాలికల ఉన్నత పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

రాజంపేట: ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందించి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అన్ని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. కానీ ఏజెన్సీ నిర్వాహకులకు గిట్టు బాటు కాకపోవడంతో చాలా చోట్ల ఈ పథకం నీరుగారుతుందనే చెప్పవచ్చు. రాజంపేట బాలికల ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సారానికి గాను సుమారు 147 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల ప్రారంభమై సుమారు 15 రోజులు కావస్తున్నా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అందడం లేదు. సోమవారం సాక్షి విజిట్ కు వెళ్లగా గతంలో వంట నిర్వహించిన ఏజెన్సీ నిర్వాహకులకు గిట్టుబాటు కాకపోగా అప్పుల పాలైనట్లు తెలిసింది. దీంతో ఈ ఏడు వంట చేయడానికి ముందుకు రాలేదు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

బిల్లులు చెల్లించడంలో జాప్యం..

నిర్వాహకులకు సకాలంలో బిల్లులు అందకనే ఏజెన్సీ నిర్వాహకులు వంట చేయడానికి ముందుకు రావడం లేదు. ఒక్కోసారి ఆరు నెలల వరకు బిల్లులు రాలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు నిత్యావసరాల ధరలు కూడా నిత్యం పెరగడంతో ఏజెన్సీ నిర్వహించడం కష్టతరమవుతుందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. అదే విధంగా పాఠశాలల్లో మెనూ ప్రకారం వంట చేయాల్సి ఉంటుంది. ఎవరైనా అధికారులు అకస్మాత్తుగా సందర్శించి తిట్ల దండకం కూడా భరించాల్సి ఉంటుంది. ఈ కారణంతోనే ఎవరు ముందుకు రావడం లేదనే ఆరోపణలు వినిపిసున్నాయి.

రోజూ ఇంటి నుంచే భోజనం



ఈ ఏడాది మొదటి నుంచి ఇంటి నుంచే భోజనం తెచ్చుకుంటున్నాం. దీంతో ఒక్కోసారి పాఠశాలకు ఆలస్యంగా వస్తున్నా. పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం అందేలా చూడాలి.

– పిట్ల పూజిత, విద్యార్థిని, రాజంపేట

జీపీకి సమాచారం అందించాం

పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు లేరని జీపీ కార్యాలయానికి నోటీస్ ద్వారా సమాచారం అందించాం. ఎవరికైనా ఆసక్తి ఉంటే పాఠశాలకు వచ్చి సంప్రదించాలని కోరాం. వారితో ఒప్పందం కుదిరితే వారికి ఏజెన్సీ నిర్వహించే అవకాశం కల్పిస్తాం.

–ఇన్‌చార్జి హెచ్‌ఎం, ఇందిర

పాఠశాలల బంద్ విజయవంతం



ఎల్లారెడ్డిలో పాఠశాలలను బంద్ చేయిస్తున్న ఏబీవీపీ నాయకులు



భిక్కనూరులో..

సాక్షి నెట్‌వర్క్: ఏబీవీపీ ఇచ్చిన పాఠశాలల బంద్ సోమవారం విజయవంతమైంది. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు యాజమాన్యాలు సెలవు ప్రకటించాయి. కొన్ని పాఠశాలలను ఏబీవీపీ నేతలు దగ్గరుండి మూసివేయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని, గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఎక్కువ ధరలకు నోటుబుక్కులు, పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలను తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు.

విద్యార్థులు సమయం వృథా చేసుకోవద్దు



క్రీడా కిట్లను అందజేస్తున్న హెచ్‌ఎం, నేతలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్ రెడ్డి సహకారంతో ప్రధానోపాధ్యాయుడు సీతయ్య విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. అదే విధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, కస్తూర్బా గాంధీ, మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు 2 లక్షలు విలువ గల డెస్క్ బెంచీలు, ఇత సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు. పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

ఉపకులాలకు 40 శాతం కేటాయించాలి



వినతి పత్రం అందజేస్తున్న సమితి నేతలు

కామారెడ్డి రూరల్: ఎస్సీ ఉపకులాలకు దళిత బంధు పథకంలో 40 శాతం కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు పస్తం పరశురాం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దళిత బంధు మొదటి విడతలో 59 దళితులలో రెండు కులాలకే న్యాయం జరిగిందే తప్ప మిగతా మోచి, హోలియదాసరి, చిందు, డక్కలి, మాష్టిన్, గోసంగి, మాలజంగం, మాలదాసరి, బైండ్ల, మాదసికురువ, సమగర, బేడ బుడ్గ జంగం, మాంగ్, మహర్, మిత అయ్యాల్వర్ తదితర 57 ఉపకులాలకు ఒక్కశాతం కూడా అందలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు సంకు పోచయ్య, సత్యం, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారికి బోనాలు



భిక్కనూరులో బోనాల ఊరేగింపులో మహిళలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని మహంకాళి అమ్మవారికి ఆశాఢ మాసం సందర్భంగా పలువురు సోమవారం బోనాలను సమర్పించుకున్నారు. పట్టణంలోని పలు వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహంకాళి అమ్మవారి అలయం వద్దకు వెళ్లి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా పెట్టారు. భారీ సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా బగళాముఖి అమ్మవారి జయంతి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని బగళాముఖి పీఠంలో అమ్మవారి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించినట్లు జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ తెలిపారు. ఆషాఢమాసం అష్టమి తిథిని పురస్కరించుకుని అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్ పాల్గొన్నారు.

సమాచారం..

నేడు రామేశ్వర్‌పల్లికి ప్రభుత్వ విప్ రాక

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లికి ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మంగళవారం విచ్చేస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, రామేశ్వర్‌పల్లి సర్పంచ్ పోతిరెడ్డిలు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆయన భూమిపూజ చేస్తారని చెప్పారు.

రేపు నల్ల బ్యాడ్జీలతో పెన్షనర్ల నిరసన

కామారెడ్డి అర్బన్: తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమితి జిల్లా కన్వీనర్ వి.హన్మంత్ రెడ్డి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

29న ఎమ్మార్పీఎస్ జిల్లా మహాసభలు

బాన్సువాడ: పట్టణంలో ఈ నెల 29న ఎమ్మార్పీఎస్ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి డల్లా సురేష్ మహాజన్ తెలిపారు. బాన్సువాడ మీన గార్డెన్‌లో నిర్వహించే జిల్లా మహాసభలకు మహాజన నేత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని చెప్పారు. నాయకులు దుర్కి బాల్‌రాజ్, సాయిలు, గంగారాం, నగేష్, వినోద్ పాల్గొన్నారు.

శ్రీఅర్ధ చాతుర్మాస్య మహావ్రతం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి సిరిసిల్ల రోడ్డులోని శ్రీకృష్ణ గీతా మందిరంలో గురువారం నుంచి ఆగస్టు 27 వరకు ఏక చత్వారింశ 41వ శ్రీఅర్ధ చాతుర్మాస్య మహావ్రతం నిర్వహిస్తున్నట్లు శ్రీగీతా తత్వార్థ జ్ఞాన సత్సంగం ప్రకటనలో తెలిపింది. వ్రతంలో భాగంగా ప్రతిరోజు ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు ధ్యానం, అనంతరం ప్రవచనాలు, ఉపన్యాసాలుంటాయని సత్సంగం పేర్కొంది.

తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



బాన్సువాడ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నిజామాబాద్ జిల్లా జెడ్పీ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబర్‌సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించిన 14 మంది ఎన్‌రోలర్స్‌కు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదు బహుమతి అందించారు. ఎన్‌రోలర్స్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఎప్పటికప్పుడు సోషల్‌మీడియా ద్వారా పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు.

నూతన వాహనం ప్రారంభం

కామారెడ్డి రూరల్: నూతన టెక్నాలజీతో భారత్ హ్యుందాయ్ నుంచి విడుదలైన గ్రాండ్ ఐ10 నియోస్ వాహనాన్ని భారత్ హ్యుందాయ్ షోరూం (కామారెడ్డి)లో జిల్లా ఆర్టీవో వాణి సోమవారం పారంభించారు. ఈ కార్యక్రమంలో హ్యుందాయ్ మేనేజర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు జరిగేలా చూడాలి



బీపీ కిట్లను అందిస్తున్న వైద్యులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులు జరిగేలా చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష అన్నారు. నెమ్లి వెల్‌నెస్ సెంటర్‌లో సోమవారం ఆరోగ్య కార్యకర్తలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ బీపీ కిట్లను అందించి అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు విధిగా నార్మల్ డెలివరీలు జరిగేలా ప్రతి గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు శ్రీలేఖ, దస్తీరాం, తదితరులున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



బాన్సువాడలో అవగాహన కల్పిస్తున్న నేతలు

బాన్సువాడ : పట్టణంలోని పాత బాన్సువాడ బస్తీ దవాఖానాలో సోమవారం సేవాసంఘం టీఐ2 సిబ్బంది ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేవా సంఘం టీఐ2 ప్రతినిధి కరుణ మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. హెచ్‌ఐవీ సోకిన వారు నెలకు ఒకసారి వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని అన్నారు. మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, గడుమల లింగమేశ్వర్, బస్తీ, సభ్యులు ఉన్నారు.

గోకుల్‌తండాకు బస్సు సౌకర్యం కల్పించాలి



డీఎంతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

రామారెడ్డి: కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం మారుమూల గిరిజన గ్రామమైన గోకుల్ తండాకు చెందిన విద్యార్థులకు ఆర్టీసీ బస్సు రాక ఇబ్బంది పడుతున్నారని, బస్సును పునరుద్ధరించాలని సోమవారం కామారెడ్డి డిపో మేనేజర్ లక్కుల మల్లేశంను కలిసి ప్రజా ప్రతినిధులు కోరారు. డీఎం స్పందించి మంగళవారం నుంచి తండాకు బస్సులు నడపాలని ఆదేశించారని ఎంపీపీ దశరత్‌రెడ్డి తెలిపారు. అలాగే విద్యార్థులకు పాసులు ఇవ్వాలని ప్రజాప్రతినిధులు డీఎంను కోరారు.

చైర్మన్ కుటుంబానికి అండగా ఉంటాం



భగవంత్‌రెడ్డి కుటుంబాన్ని ఓదారుస్తున్న ఎమ్మెల్యే

భిక్కనూరు: మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం ఆయన అంతంపల్లి గ్రామానికి వచ్చి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న భగవంత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. భగవంత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు 30 ఏళ్లుగా భగవంత్‌రెడ్డితో అనుబంధం ఉందని, ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబోద్దిన్, ఎంపీపీ గాలిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ మధుమోహన్ రెడ్డి ఎంపీటీసీ మంజుల పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి పట్టణ సీఐ నరేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు



పెద్దకొడప్‌గల్ గాంధీ చౌరస్తాలో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



పిట్లంలో ముదిరాజ్ నేతల ఆధ్వర్యంలో ర్యాలీ

సాక్షి నెట్‌వర్క్:ముదిరాజ్ కులాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసి దాడి చేసిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ముదిరాజ్ సంఘం నాయకులు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆందోళనలు చేశారు. కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆయనను పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని సంఘం నేతలు తెలిపారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



మద్నూర్ ఆర్ఐ రాచప్పకు వినతి పత్రం అందిస్తున్న పెన్షనర్లు



బాన్సువాడ తహసీల్దార్ గంగాధర్‌కు..



ఎల్లారెడ్డిలో తహసీల్దార్ సుధాకర్‌కు..

మద్నూర్/ఎల్లారెడ్డి/బాన్సువాడ రూరల్: పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించి, పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మద్నూర్ తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ రాచప్పకి సోమవారం పెన్షనర్లు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. అలాగే బాన్సువాడలో తహసీల్దార్ గంగాధర్‌కు, ఎల్లారెడ్డిలో తహసీల్దార్ సుధాకర్‌కు పెన్షనర్లు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెన్షనర్ల మూల వేతనం నుంచి ఒక శాతం మినహాయించి పూర్తి స్థాయిలో ఈహెచ్ఎస్ అమలు చేయాలని కోరారు. ప్రతి నెలా 1న పెన్షన్లను చెల్లించాలన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



వృథాగా పోతున్న మంచి నీరు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో జైభవానీ సిమెంట్ షాపు సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ జరిగి మంచి నీరు వృథాగా పోతోంది. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు మిషన్ భగీరథ అధికారులకు తెలిజేశారు. స్పందించిన మిషన్ భగీరథ డీఈ కౌశిక్, లీకవుతున్న ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

సంక్షిప్తం

దళితు బంధుతో జీవితాల్లో మార్పు

బాన్సువాడ రూరల్: దళితబంధు పథకంతో ఎంతోమంది జీవితాల్లో మార్పు వచ్చిందని బాన్సువాడ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు అన్నారు. సోమవారం ఆయన బోర్లం గ్రామ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మాట్లాడారు. దళితబంధులో భాగంగా రెండోవిడత ఒక్కో నియోజకవర్గానికి 1100 మంది చొప్పున మొత్తం 1.30 లక్షల మందికి ప్రయోజనం చేకూరే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించడం హర్షణీయమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మండల డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, అజయ్‌లు మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభమైనా స్కూళ్లలో సమస్యలు ఇంకా అలానే ఉన్నాయని, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పారిశుధ్యం అమలుపై ప్రత్యేకదృష్టి సారించాలని నాగిరెడ్డిపేట మండల పంచాయతీ అధికారి(ఎంపీవో) శ్రీనివాస్ సూచించారు. బంజరతండా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మమత ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

భిక్కనూరు: మండల కేంద్రంలోని జీపీ ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ బోడ నరేశ్, ఎంపీటీసీ తాటికొండ బాబు, మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్, విండో వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ విడుదల చేసే వ్యర్థాల వల్ల పర్యావరణం దెబ్బతింటోందని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా భావించాలని కాచాపూర్ వీడీసీ అధ్యక్షుడు మైపాల్ అన్నారు. సోమవారం కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ వ్యర్థాల నుంచి ప్రజలను రక్షించాలని కోరుతూ చేపట్టిన దీక్షలు 63వ రోజుకు చేరుకున్నాయి. ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు పోరాటం కొనసాగిస్తామని మైపాల్ తెలిపారు.

కొనుగోలు చేసిన వాటికి రసీదులు ఇవ్వాలి

భిక్కనూరు: రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు వ్యాపారులు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని భిక్కనూరు ఏవో రాధ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తనాలు పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన నమూనాలను సేకరించి రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి పంపుతున్నట్లు చెప్పారు.